# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, కర్నూలు జిల్లాలలో పర్యటిస్తారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో వన్ గవర్నమెంట్ వన్ సిటిజన్ విధానంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమవుతుంది.**

4. **ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల పాలనలో పారదర్శకత ప్రతిబింబించేలా సంస్కరణలు తీసుకువచ్చామని ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పర్యాటక ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు.**

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, కర్నూలు జిల్లాలలో పర్యటిస్తారు. ప్రధానమంత్రి ఢిల్లీ నుండి బయలుదేరి కర్నూలు విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుండి హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకుంటారు. అక్కడ నుండి రోడ్డు మార్గంలో శ్రీశైలం వెళ్ళి శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వార్లను దర్శించుకుంటారు. ఆ తరువాత శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. ఈ కార్యక్రమానంతరం కర్నూలులోని నన్నూరు గ్రామం వద్ద జరిగే జి. ఎస్. టి. 2.0 రిఫార్మ్స్ పై బహిరంగ సభనుద్దేశించి మాట్లాడతారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పాల్గొంటారు.

--------------------------

కర్నూలు పర్యటన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో పూజల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. తర్వాత కర్నూలులో 13 వేల 400 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటానని.. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతో పాటు ఇతర రంగాలకు సంబంధించినవని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కర్నూలులో ప్రధాని పర్యటన ఏర్పాట్లను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

వాయిస్ 31 సెకన్లు

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటన భద్రతా ఏర్పాట్లపై ఆంధ్రప్రదేశ్ పోలీసు డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా పోలీసు అధికారులతో సమీక్షించారు. అధికారులు ప్రణాళిక ప్రకారం సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో శ్రీశైలంలో ప్రధానమంత్రి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేశామని నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వన్ గవర్నమెంట్ వన్ సిటిజన్ విధానంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని రియల్ టైం గవర్నెన్స్ – ఆర్టీజీఎస్ పనితీరుపై ముఖ్యమంత్రి నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వస్తు సేవల పన్ను – జీఎస్టీ ద్వారా నిత్యావసరాలు, ఇతర ఉత్పత్తులపై పన్నులు తగ్గిన అంశంపై గిరిజన ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలు, కార్యక్రమాల అమలు తీరు తెలుసుకునేందుకు నవంబరు నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని తెలిపారు.

-----------------------------

తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాదులోని సచివాలయంలో ఈరోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో ధాన్యం సేకరణ, శ్రీశైలం ఎడమగట్టు కాలువ ఎస్. ఎల్. బి. సి. సొరంగం పనుల పునఃప్రారంభం, ఫైబర్ నెట్ విస్తరణ, మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ, స్థానిక ఎన్నికలు వంటి అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల పాలనలో పారదర్శకత ప్రతిబింబించేలా సంస్కరణలు తీసుకువచ్చామని ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగర పంచాయతీలుగా గుర్తించిన వాటిలో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. పంచాయతీలను నాలుగు గ్రేడులుగా వర్గీకరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే వీలు కలుగుతుందని వివరించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పర్యాటక ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. రాజస్థాన్‌లోని ఉదయ్ పూర్‌లో అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులతో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను మంత్రి నిన్న వెల్లడించారు. ప్రపంచ పర్యాటక కేంద్రాలుగా తిరుపతి, విశాఖ పట్నాలను అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలన్నారు. అమరావతిలో పర్యాటక భవన్, రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి దుర్గేష్ తెలిపారు.

---------------------------

తెలుగు చలన చిత్ర రంగంలో తొలి నేపథ్య గాయని రావు బాల సరస్వతి నిన్న హైదరాబాదులో కన్నుమూశారు. ఆమె వయసు 97 సంవత్సరాలు. 1928వ సంవత్సరం ఆగస్టు 28 వ తేదీన అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ వెంకటగిరి పట్టణంలో జన్మించిన ఆమె ఆరేళ్ల వయసు నుండే పాటలు పాడడం ఆరంభించారు. ఆకాశవాణి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా తెలుగు వారికి పరిచయమయ్యారు. "సతీ అనసూయ" చిత్రంలో తొలి పాటను ఆలపించారు. తెలుగు, తమిళ , కన్నడ, హిందీ భాషలలో రెండు వేలకు పైగా పాటలు పాడారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. రానున్న మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ..

..వాయిస్.. 16 సెకన్లు

తెలంగాణలోనూ రెండురోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

హైదరాబాదులోని జూబ్లీ హిల్స్ శాసన సభా స్థానానికి జరగనున్న ఉప ఎన్నికకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పేరును ఆ పార్టీ నాయకత్వం నిన్న ఖరారు చేసింది. భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా ఖరారైన మాగంటి సునీత నిన్న నామినేషన్ దాఖలు చేశారు. కాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఉప ఎన్నిక నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21 తేదీ తుది గడువు కాగా 22వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నవంబర్ 11వ తేదీన పోలింగ్ జరగనుండగా 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు.

---------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ సంస్కరణల ద్వారా పర్యాటక రంగంలో మరింత ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర వస్తు సేవల పన్ను–ఎస్ జీఎస్టీ విశాఖపట్నం అదనపు కమిషనర్ సీతారామ్ శేఖర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం ఆర్కే బీచ్ లో పర్యాటక శాఖ, జీఎస్టీ శాఖ సంయుక్తంగా నిర్వహించిన సూపర్ జీఎస్టీ –

సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారామ్ శేఖర్ మాట్లాడుతూ, జిఎస్టి తగ్గింపుల ద్వారా సామాన్య ప్రజలకు హెూటళ్లు, రెస్టారెంట్లు వంటి పర్యాటక సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖల్లో పొగాకు ఉత్పత్తిదారులు, సంస్థల చిహ్నాల ప్రచారం లేకుండా చూడాలని రాష్ట్ర పొగాకు నియంత్రణ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఈ. ప్రశాంత్ తెలిపారు. పొగాకు వాడకం తగ్గింపు చర్యల్లో భాగంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల అధికారులకు విజయవాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యశాలలో ఆయన నిన్న పాల్గొన్నారు.

======================